నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, మంగళవారం 28 జనవరి 2025 | HYDERABAD

సమ్మె నోటీసులిచ్చిన ఆర్టీసీ జేఏసీ

సిటీబ్యూరో, జనవరి 27 (నమస్తే తెలంగాణ) : ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని మాటిచ్చి..అధికారంలోకి వచ్చాక మోసం చేసిన సర్కార్‌కు బుద్ధి చెబుతామని ఆర్టీసీ జేఏసీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జేఏసీ నాయకులు సోమవారం బస్సు భవన్‌లో అధికారులకు సమ్మె నోటీసులు ఇచ్చారు. ఈ క్రమంలో పోలీసులు అక్కడ భారీగా మోహరించారు. కార్మికులను భవన్‌లోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో కార్మిక నాయకులు ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తామేమైనా ఉగ్రవాదులమా అంటూ ప్రశ్నించారు. తమ హక్కుల సాధనకు ఉద్యమిస్తున్నామని తమను ఉగ్రవాదులగా చూడొద్దని హితవు పలికారు. 21 డిమాండ్లతో ప్రభుత్వం ముందు ఉంచామని.. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ తీసుకోకపోతే సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. కాగా, గ్రేటర్‌లోని పలు బస్సు డిపోల నుంచి కార్మికులు అధిక సంఖ్యలో బస్సు భవన్ వద్దకు చేరుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆర్టీసీని ప్రయివేటీకరణ చేయడంలో భాగంగా సర్కార్ ఆలోచనలు ఉన్నాయని ఆరోపించారు. ఎలాంటి విచారణలు జరపకుండానే కార్మికులను సస్పెండ్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఈయూ, ఎన్ఎంయూ, బీకేయూ, బీడబ్ల్యూయూ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ భవన్‌లో సోమవారం తెలంగాణ విద్యార్థి విభాగం నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో మాజీ మంత్రులు మహమూద్ అలీ, పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, గ్యాదరి కిశోర్, బీఆర్ ఎస్‌నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, బీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస యాదవ్, ఎర్రోళ్ల శ్రీనివాస్, బాలరాజు యాదవ్, తుంగబాలు, రాకేశ్‌రెడ్డి, ఆంజనేయులు గౌడ్, వాసుదేవరెడ్డి, రాజారాం యాదవ్, సతీశ్, శుభప్రద్ పటేల్

ఒత్తిళ్లకు.. బల్దియా జీ హుజూర్!

గోషామహల్ ఆజాద్ మార్కెట్‌లో ఆగని లీజు దందా

మేయర్, ఎంఐఎం నేతల మధ్య వివాదంతో వ్యాపారస్తుల జోలికి వెళ్లని అధికారులు

లీజు గడువు ముగిసినా యథేచ్ఛగా వ్యాపారం

ఖజానాకు గండి పడుతున్నా పట్టని యంత్రాంగం

సిటీబ్యూరో, జనవరి 27 (నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ ఎస్టేట్ విభాగం కళ్లు మూసుకున్నది. సంస్థకు ఎక్కడెక్కడ ఆస్తులు ఉన్నాయి? ఎన్ని షాపుల అద్దె గడువు ముగిసింది? ఏళ్ల తరబడి లీజు గడువు ముగిసిన ఆయా దుకాణాలు ఎందుకు ఖాళీ చేయలేదు? జారీ చేసిన నోటీసులు ఎన్ని? మళ్లీ టెండర్ల వేలం వేసి ఆదాయాన్ని ఎందుకు పెంచుకోవడం లేదు? అనే ప్రశ్నలకు వారి వద్ద నుంచి సమాధానమే లేదు. అసలు ఆ దిశగా సమీక్షే లేదు. ఇది చాలదన్నట్లు ఘనత వహించిన ఎస్టేట్ విభాగంలో కొందరి అధికారులు కేవలం తమకు వచ్చే వసూళ్లపైనే దృష్టి పెడుతున్నట్టు జీహెచ్ఎంసీ శాఖలోనే చర్చ జరుగుతున్నది. నోటీసులు ఇవ్వడం ఆ తర్వాత అందినంత దండుకోవడం ఓ తంతుగా మారింది. చివరకు మేయర్ స్వయంగా తనిఖీలు చేసి ఆక్రమాలను వెలుగులోకి తీసుకువచ్చినప్పటికీ ఎస్టేట్ విభాగం అధికారుల్లో కనీస చలనం లేకుండా పోయింది.

ఇలా సీజ్ చేస్తే.. అలా తెరిపించేశారు

ఖైరతాబాద్ జోన్‌లోని గోషామహల్ సర్కిల్ – 14లో అజాద్(మోతి)మార్కెట్‌లో రెండు నెలల క్రితం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో కళ్లు చెదిరే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. అడుగడుగునా కలుషిత, అపరిశుభ్రమైన, నాణ్యత లేని మాంసం విక్రయాలు జరుపుతున్నట్లు తేలింది. వెంటనే సంబంధిత రెండు చికెన్ షాపులను తక్షణమే సీజ్ చేయాలని మేయర్ అధికారులను ఆదేశించింది. ఇది జరిగిన కొద్ది సేపటికే మజ్లిస్ పార్టీ ఎమ్మెల్సీ బేగ్, కొందరు వార్డు మెంబర్లు ఆ మార్కెట్‌కు చేరుకుని జీహెచ్ఎంసీ అధికారులను బెదిరించారు. సీజ్ చేసి తీసుకువెళ్లిన చికెన్‌ను బలవంతంగా వెనక్కి తీసుకున్నారు. తిరిగి 24 గంటల వ్యవధిలోనే షాపులను తెరిపించి యథేచ్ఛగా వ్యాపారం సాగేలా చేశారు. ఈ విషయంలో మేయర్ ఆదేశాలను అధికారులే ఖాతరు చేసే పరిస్థితీ తీసుకొచ్చారు. ఇంట్లో ఎలుకలు ఉన్నాయని, ఇంటిని సీజ్ చేసుకుంటామా? అంటే ఎమ్మెల్సీ బేగ్ మేయర్ తనిఖీల తీరును ఎండగట్టారు. మరోవైపు మేయర్ మాత్రం.. ఎట్టి పరిస్థితుల్లోనూ చర్యలు ఉండాల్సిందేనని అధికారులకు హుకుం జారీ చేశారు. ఇది జరిగి రెండు నెలలు కావొస్తున్నా నేటికీ ఆజాద్ మార్కెట్‌లో బల్దియా నిబంధనలు అమలు కావడం లేదు. విచిత్రమేమిటంటే ఆ మార్కెట్‌లో 1960 సంవత్సరంలో లీజు తీసుకుని గడువు ముగిసి సంవత్సరాలు గడిచినా కొన్ని షాపులు కొనసాగిస్తుండడం అధికారుల పనితీరుకు అద్దం పడుతున్నది. మొత్తం 11 షాపులలో మూడు షాపుల నుంచే క్రమం తప్పకుండా అద్దెలు వస్తుండగా, మిగిలిన 8 షాపుల నుంచి సంవత్సరాల తరబడి అద్దెలు రావడం లేదు. పైగా ప్రజా ఆరోగ్యానికి తీవ్రమైన ముప్పును కలిగిస్తూ వ్యాపారాలు జరుగుతున్నాయి. కానీ నేటికీ అటు వైపు వైద్య విభాగం, జోనల్ కమిషనర్లు, ఎస్టేట్ విభాగం కన్నెత్తి చూపకపోవడం పట్ల తీవ్ర స్థాయిలో విమర్శలు వినిపిస్తున్నాయి.

రెండు నెలల క్రితం ఆజాద్ మార్కెట్‌ను సందర్శించిన మేయర్

అసలు ఆ రోజు ఏం జరిగిందంటే ?

సర్కిల్–14 డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ హెల్త్, వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ అసిస్టెంట్ డైరెక్టర్, వెటర్నరీ ఆఫీసర్ అధికారుల బృందం రషీద్ హుస్సేన్ (స్టాల్ నం.3), కలీమ్ హుస్సేన్‌లు (స్టాల్ నం 42) నిర్వహిస్తున్న చికెన్ షాపులపై నవంబరు రెండవ వారంలో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలో 1600 కంటే ఎక్కువ బ్రాయిలర్ కోళ్లు, 30 కిలోల డ్రెస్‌డ్ చికెన్, 7 కిలోల లివర్ కనుగొన్నారు. ప్రజా ఆరోగ్య భద్రత దృష్ట్యా వెటర్నరీ విభాగం సంబంధిత చికెన్, లివర్‌ను స్వాధీనం చేసుకుని బ్రాయిలర్ పక్షులు(కోళ్లు) రెండు గంటల లోపు తీసుకువెళ్లాలని ఆయా షాపుల నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ ఘటన జరిగిన కొంత సమయం తర్వాత మజ్లిస్ పార్టీ ఎమ్మెల్సీ బేగ్, కొందరు వార్డు మెంబర్లు అక్కడకు చేరుకుని జీహెచ్ఎంసీ అధికారులను బెదిరించారు. సీజ్ చేసి తీసుకువెళ్లిన చికెన్‌ను బలవంతంగా తీసుకువెళ్లారు. ఈ ఘటనపై గోషామహల్ సర్కిల్ వెటర్నరీ ఆఫీసర్ కాచిగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా జీహెచ్ఎంసీ చట్టం 1955 సెక్షన్ 521, 622, 487, 596 కింద షాపులు ఖాళీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు షాపుల యాజమానులు ఆ నోటీసులు స్వీకరించకుండా తిరస్కరించడంతో వాటిని గోడపై అతికించడంతో పాటు రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా పంపించారు. కానీ నేటికీ షాపులను ఖాళీ చేయించలేకపోవడం గమనార్హం. సంబంధిత షాపుల నుంచి రూ.లక్షల్లో అద్దెలు రావడమే కాదు...ఆ దుకాణాల నుంచి సంబంధిత యాజమానులను ఖాళీ చేయించి కొత్తగా వేలం ద్వారా టెండర్లు పిలిచి ఆదాయాన్ని పెంచుకోవాల్సిన చోట ఇదేమి పట్టడం లేదు. అదనపు కమిషనర్ (హెల్త్)తో పాటు సంబంధిత ఎస్టేట్ విభాగం అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనబడుతున్నది. ఆ షాపుల జోలికి వెళ్లకపోవడం వెనుక అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బహిరంగంగా లీజు గడువు ముగిసిందని తెలిసినా షాపుల జోలికి వెళ్లకపోవడం వెనుక ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గుతున్నారు? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అంతేకాకుండా బాధ్యులైన అధికారులపై ఇప్పటి వరకు చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కేసీఆర్ ఫ్రీగా ఇస్తే..
కాంగ్రెస్ పాలనలో బిల్లులు

బడంగ్‌పేట గాంధీనగర్ పేదలకు తాగునీటికి వేల రూపాయల్లో బిల్లులు

గృహజ్యోతికి అర్హులైనా.. తప్పని కరెంటు చార్జీలు

బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ ఎదుట కాలనీ వాసుల ఆందోళన

బడంగ్‌పేట, జనవరి 27 : రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేద కుటుంబాలకు కేసీఆర్ ఉచితంగా తాగునీళ్లు అందిస్తే ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో మాత్రం వారికి వేల రూపాయల్లో బిల్లులు వస్తున్నాయి. గృహజ్యోతికి అర్హులైనా.. నెలనెలా కరెంటు చార్జీలు మాత్రం చెల్లించాల్సి వస్తున్నది. ఇదేం అన్యాయమని అడిగితే సమస్యను పరిష్కరించే నాథుడు లేడు. దీంతో బడంగ్‌పేట మున్సిపాలిటీలోని గాంధీనగర్ వాసులు సోమవారం ఏకంగా మున్సిపల్ కార్యాలయం ముందే ఆందోళన చేశారు. ఇంజనీరింగ్ విభాగం డీఈని ఘెరావ్ చేశారు.

ఇన్నాళ్లూ ఉచితంగా ఇచ్చి..

బడంగ్‌పేట మున్సిపాలిటీలోని గాంధీనగర్‌లో 1400 పై చిలుకు కుటుంబాలు ఉన్నాయి. వీరందరూ గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. కానీ కేవలం 20 ఇండ్లకు మాత్రమే జీరో బిల్లులు ఇస్తున్నారు. మిగతావారికి మాత్రం వందల రూపాయల్లో బిల్లులు పంపుతున్నారు. కాలనీ వాసులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నప్పటికీ సమస్య అలాగే ఉండిపోయింది. కాలనీ ఏర్పడిన నాటి నుంచి.. బీఆర్ ఎస్ అధినేత కేసీఆర్ పాలనలో తాగునీళ్లను ఉచితంగానే సరఫరా చేశారని కానీ ఇప్పుడు కాంగ్రెస్ పాలనతో మాత్రం పాత బకాయిలన్నీ కలిపి ఇవ్వాలంటూ ఒక్కో ఇంటికి వేల రూపాయల్లో బిల్లులు పంపారని కాలనీ వాసులు మండిపడుతున్నారు. గాంధీనగర్‌లో 50 గజాలు, 30 గజాల ఇండ్లు ఉన్న వారికి 15వేలు,20 వేలు కట్టాలని నోటీసులు పంపిస్తే ఎలా కట్టగలమని వాపోయారు. అంతేకాకుండా తమ కాలనీకి మంజూరైన రోడ్డును ఉన్నట్టుండి రద్దు చేశారని అందుకు కారణమేమిటో చెప్పాలని పట్టుబట్టారు. మంచినీటి బిల్లు కట్టాల్సిన అవసరం లేదని బడంగ్‌పేట కమిషనర్ కూడా ఇటీవల హామీ ఇచ్చారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. బిల్లులు మాఫీ చేసే వరకు పోరాటం చేస్తామన్నారు. ఎన్నికల సమయంలో పేదల కాలనీలలో ఉచిత విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చారని కానీ ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత వందలో పది మందికి జీరో బిల్లు ఇచ్చి అందరికి అయిపోయిన్నట్లు చెప్పడం పై కాలనీ వాసులు మండి పడుతున్నారు.

30 వేల నీటి బిల్లు వచ్చింది: నర్సమ్మ గాంధీ నగర్

గాంధీనగర్‌లో మేం ఉంటున్న 2 గదులకు 30వేల బిల్లొచ్చింది. ఎట్ల గట్టాలె. పేదోళ్లం సారూ. బిల్లులు మాఫీ చేస్తమంటిరి. ఇప్పటివరకు చేయలేదు. నెలనెలా మాకైతే బిల్లులు పంపిస్తున్నరు. నీళ్లైతే సరిగ్గ వస్తలేవు కానీ బిల్లులు మాత్రం ఇచ్చిపోతున్నరు.

ముసలోళ్లం ఎట్ల గడ్తం: లక్ష్మీ నర్సమ్మ

ఎలక్షన్లప్పుడు .. నీళ్లు ఫ్రీగ ఇస్తమన్నరు. కరెంటు ఫ్రీ అన్నరు. ఎలక్షన్లు అయిపోయినాంక మా బాధను ఎవ్వరు పట్టించుకుంటలేరు. మేం ముసలోళ్లం. బిల్లులు కట్టనీకె వేల రూపాయలు ఏనుంచి పట్కురావాలె.

న్యాయం చేయండి: సత్యనారాయణ

గతంలో..ఈ సమస్యలను మేయర్‌కు, కమిషనర్‌కు చెప్పినం. వాళ్లు మా బిల్లులను మాఫీ చేయిస్తమన్నరు. ఇప్పుడేమో ఎవ్వరూ పట్టించుకుంటలేరు. మా కాలనీలో నూటికి పదిశాతం కూడా జీరో బిల్లులు వస్తలేవు.

పై అధికారులకు విన్నవిస్తా: డిఈ జ్యోతి

గాంధీనగర్ తాగునీటి సమస్యను, బిల్లుల వ్యవహారాన్ని జలమండలికి నివేదిస్తాను. ఈ సమస్యను పరిష్కరించాల్సింది వారే. ఇక గృహజ్యోతి–జీరో బిల్లుల వ్యవహారం కూడా నా పరిధిలో లేదు. గాంధీనగర్ వాసులు నా చాంబర్ ముందే ధర్నా చేశారు. విషయాల్నింటినీ కమిషనర్‌కు వివరిస్తాను. కాలనీల్లో ఉన్న రోడ్లను పరిశీలిస్తాను.

బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ముందు ఆందోళ న చేస్తున్న గాంధీనగర్ కాలనీ వాసులు (ఇన్‌సెట్)వేలలో వచ్చిన బిల్లు

మురుగు నుంచి విముక్తి ఎప్పుడో

సికింద్రాబాద్‌లోని మారేడ్‌పల్లి ప్రాంతంలోని అంబేద్కర్ నగర్ బస్తీలో గత నెల రోజులుగా మురుగు నీళ్లు. ఇళ్ల మధ్యలో నుంచి ప్రవహిస్తున్నాయి. కనీసం అడుగు తీసి అడుగు పెట్టే పరిస్థితి లేదు. మురుగు నీరు పెరిగిపోవడంతో ఈగలు, దోమల బెడద విపరీతంగా పెరిగిపోయింది. బస్తీ వాసులందరూ స్థానిక జీహెచ్ఎంసీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు ఎవరూ స్పందించలేదు. రాజకీయ నాయకుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోవడం లేదు. పాఠశాలకు వెళ్లే విద్యార్థులు ఈ మురికినీటిపైనే ప్రతిరోజూ నడుచుకుంటూ వెళ్తున్నారు. మురుగు నీటి నుండి తమకు ఇంకెప్పుడు విముక్తి కలుగుతుందోనని బస్తీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నోటీసులివ్వకుండా ఎలా అరెస్టు చేస్తారు

ఓ యువకుడి అరెస్టు కేసులో తెలంగాణ డీజీపీ వివరణ కోరిన ఢిల్లీ కోర్టు

సిటీబ్యూరో, జనవరి 27 (నమస్తే తెలంగాణ): న్యాయ సూత్రాలకు విరుద్ధంగా ఓ యువకుడిని అరెస్టు చేసిన ఘటనలో ఢిల్లీ హైకోర్టు తెలంగాణ డీజీపీ వివరణ కోరింది. నోటీస్ ఇవ్వకుండా అరెస్టు చేయవద్దని సూచించింది. రాచకొండ కమిషనరేట్‌లోని మీర్‌పేట్ పోలీసులు నెల రోజుల క్రితం ఢిల్లీకి వెళ్లి ఓ యువకుడిని అరెస్టు చేసి తీసుకొచ్చారు. ఒక కాంగ్రెస్ నాయకుడు ఇచ్చిన ఫిర్యాదుపై మీర్‌పేట్ పోలీసులు ఆగమేఘాలపై స్పందించి ఢిల్లీకి వెళ్లి ఎలాంటి న్యాయ నిబంధనలు పాటించకుండా తనను అరెస్ట్ చేశారని బాధితుడు నందీశ్వర్ రెడ్డి ఆరోపించాడు. ఈ మేరకు తనను మీర్‌పేట్ పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేశారని, బాధితుడు నందీశ్వర్‌రెడ్డి డీజీపీ, ఇతర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. ఎవరూ స్పందించకపోవడంతో ఢిల్లీ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశాడు. దీనిపై ఢిల్లీ కోర్టు వారం రోజుల క్రితం వాదనలు విని నోటీసులు ఇవ్వకుండా ఎలా అరెస్ట్ చేశారని ప్రశ్నించింది. అంతర్రాష్ట్ర స్థాయిలో అరెస్ట్ చేసే సమయంలో ఢిల్లీలోనే తెలంగాణ పోలీసులు ట్రాన్సిట్ వారెంట్‌తో రిమాండ్ చేయాల్సి ఉన్నా దానిని విస్మరించారని కోర్టు పేర్కొంది. భవిష్యత్తులో పిటిషనర్‌కు నోటీసు ఇవ్వకుండా అరెస్ట్ చేయవద్దని సూచించింది. పిటిషనర్‌ను అరెస్ట్ చేసే సమయంలో అవలంభించిన నిబంధనలు ఏమిటో, ఈ అంశానికి సంబంధించిన పూర్తి వివరాలతో 6 వారాలలో నివేదిక అందించాలని తెలంగాణ పోలీసులకు ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

ఆబ్కారీ నేరాలు ఆన్‌లైన్‌లో నమోదు

సిటీబ్యూరో, జనవరి 27 (నమస్తే తెలంగాణ): పోలీసు శాఖ తరహాలోనే ఆబ్కారీ శాఖ కూడా తమ శాఖలో చోటు చేసుకునే నేరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచేందుకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం ఆబ్కారీ నేరాలకు సంబంధించిన కేసుల నమోదు, వాటి పురోగతి తదితర అంశాలన్నీ మ్యాన్యువల్‌గానే నిర్వహిస్తున్నారు. పేపర్ రహిత సేవలందించాలనే ఉద్దేశంతో ఇక నుంచి ఆబ్కారీ నేరాలకు సంబంధించిన పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని నిర్ణయించిన ఉన్నతాధికారులు ఆ దిశగా చర్యలు మొదలు పెట్టారు. దీని వల్ల కేసుల నమోదులో అవకతవకలు, వివక్ష వంటివి జరగకుండా చూడడమే కాకుండా దర్యాప్తు పారదర్శకంగా ఉండడం, ముఖ్యంగా అన్ని స్థాయిల అధికారులు కేసుల దర్యాప్తులోని పురోగతిని పర్యవేక్షించేందుకు ఈ ఆన్‌లైన్ విధానం ఉపయోగపడుతుందని అధికారులు చెబుతున్నారు. ఆబ్కారీ కేసుల్లో కన్విక్షన్ రేటును పెంచే క్రమంలో దర్యాప్తు పకడ్బందీగా ఉండాలని ఇటీవల ఆబ్కారీ ఈడీ కమలాసన్‌రెడ్డి అధికారులకు సూచించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే అధికారులు ఆబ్కారీ నేరాలకు సంబంధించిన పూర్తి వివరాలను డిజిటలైజ్ చేసేందుకు కసరత్తు మొదలు పెట్టారు. ఈ క్రమంలోనే ఆబ్కారీ ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ డైరెక్టర్ ఖురేషీ, అడిషనల్ ఎస్పీ భాస్కర్, బేవరీస్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రయ్య, ఈఎస్‌లు అంజిరెడ్డి, ప్రదీప్‌రావు, డీఎస్పీలు తుల శ్రీనివాస రావు, తిరుపతియాదవ్‌లు ఆన్‌లైన్ విధానంపై జరిగిన సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు.

ఆన్‌లైన్ విధానంపై సమీక్ష జరుపుతున్న అధికారులు

కన్నకొడుకు కోసం కన్నీరుమున్నీరుగా..

బేగంపేట్ జనవరి 27: ఆదివారం రాత్రి హుసేన్‌సాగర్‌లో జరిగిన అగ్నిప్రమాద ఘటనలో గల్లంతైన తమ కుమారుడి ఆచూకీ కోసం తల్లిదండ్రులు వేయికళ్లతో నిరీక్షిస్తున్నారు. కన్నీరుమున్నీరై విలపిస్తున్నారు. హుస్సేన్ సాగర్‌లో జరిగిన అగ్ని ప్రమాద ఘటనలో ఓ యువకుడు గల్లంతయ్యాడు. ఆదివారం రాత్రి భారతమాతకు మహా హారతి జరుగుతున్న క్రమంలో సాగర్ నీటిలో బోటు నుంచి పటాకులు కాల్చడంతో అగ్ని ప్రమాదం జరిగిన సంగతి విదితమే. ఈ సంఘటనలో నాగారానికి చెందిన అజయ్(21) అనే బీటెక్ విద్యార్థి రాత్రి నుంచి అదృశ్యమయ్యాడు. సోమవారం ఉదయం నుంచి ఆ యువకుడి కోసం డీఆర్ఎఫ్ బృందాలు, గజ ఈతగాళ్లు సాయంత్రం వరకు గాలింపు చేపట్టినా ఆచూకీ లభించలేదు. ఈ ఘటనలో గాయపడిన మరో వ్యక్తి గణపతి(22) తీవ్ర గాయాలతో సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మరో ఇద్దరు ప్రణీత్‌కుమార్(32), సునిల్(35)లు అదే ఆసుపత్రిలో కోలుకుంటున్నట్టు తెలిసింది. వీర వెంకట నారాయణ అనే వ్యక్తికి స్వల్ప గాయాలవ్వడంతో ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేశారు. అయితే గల్లంతైన యువకుని తల్లిదండ్రులు జానకీరాం, నాగలక్ష్మిలు సెక్రటరియట్ పోలీసుల చుట్టూ తిరుగుతూ కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. గల్లంతైన అజయ్ గీతాంజలి ఇంజనీరింగ్ కాలేజ్‌లో తృతీయ సంవత్సరం చదువుతున్నట్టు తెలిసింది.

సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న జుబేర్ అక్రమ్

మా ప్లాట్లను కబ్జా చేసి దౌర్జన్యం చేస్తున్నారు

ఏకశిలానగర్ ఓనర్స్ అసోసియేషన్

ఖైరతాబాద్, జనవరి 27 : తమ ప్లాట్లను కబ్జా చేసి వాటిని విక్రయిస్తూ తమపై దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఏకశిలా నగర్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు వాపోయారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు జుబేర్ అక్రమ్, రామ్ రెడ్డి, చెరుకు శివారెడ్డి, ముత్తారెడ్డిలు తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ మండలం కొర్రెముల గ్రామంలో 1985 సర్వే నం. 739 నుంచి 749లోని సుమారు 2,086 ప్లాట్లను వివిధ శాఖల్లో ఉద్యోగాలు చేస్తున్న సిబ్బంది సొంత డబ్బులు, రుణాల ద్వారా కొనుగోలు చేశారన్నారు. అందులో కొందరు ఇండ్లను సైతం నిర్మించుకున్నారన్నారు. మరికొందరు నాడు అభివృద్ధి చెందని కారణంగా ఎలాంటి నిర్మాణాలు చేపట్టలేదన్నారు. 2005లో హర్ష కన్‌స్ట్రక్షన్స్‌కు చెందిన ఎ. వెంకటేశ్ తమ ప్లాట్లను వ్యవసాయ భూమిగా చూపిస్తూ తమకు ప్లాట్లను విక్రయించిన వారి వద్ద నుంచి కొనుగోలు చేసినట్లు తప్పుడు పత్రాలు సృష్టించి కబ్జా చేశాడని వెల్లడించారు. అంతేకాకుండా అవే పత్రాలపై రూ.40కోట్ల రుణాలు కూడా తీసుకున్నారని చెప్పారు. 2006లో డీపీవోతో తమ లేవుట్‌లను రద్దు చేయించారని తెలిపారు. సకాలంలో వడ్డీలు చెల్లించకపోవడంతో బ్యాంకు అధికారులు అక్కడికి వచ్చి విచారణ చేయగా, ఆ విషయం తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. 2008లో హైకోర్టును ఆశ్రయించగా, తమకు అనుకూలంగా తీర్పునిచ్చిందని, దీంతో వారి మ్యుటేషన్‌ను రద్దు చేశారని వెల్లడించారు. కొందరు ఆ ప్లాట్లకు ఎల్ఆర్ఎస్ సైతం కడుతూనే ఉన్నారని, మరికొందరికి ఇంటి అనుతమతులు కూడా వచ్చాయన్నారు. తాజాగా మళ్లీ కొందరు కబ్జాదారులతో కలిసి తమ ప్లాట్లను కబ్జా చేశారని, తమ స్థలాల వద్దకు తాము వెళ్లకుండా రౌడీలను పెట్టి దౌర్జన్యం చేస్తున్నారని వాపోయారు. ప్రభుత్వం స్పందించి తమకు రక్షణ కల్పించి, న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో శ్రీనివాస్, నిర్మల,రంజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.